# నా శకుంతల కళ్ళు

రచన.
శ్రీమతి పి. జి. శశి

ఆ కళ్ళే...ఆ కళ్ళనుండి తుమ్మెద బారుల్లా ప్రసారమయ్యే ఆ చూపులే! ఆ చూపుల్లో పాదరసంలా తిరుగాడే ఆ అయస్కాంతపు శక్తి నన్నామెకు దాసునిగా జేశాయి.

చీకట్లో జాబిలికోసం వెతికే తారలు, నిశీధిలో ప్రవహించే కృష్ణాతరంగాల్లో ఈదులాడే శశి నీడలు, నిశ్చల జలమందిర వాతాయనములనుండి చంద్రునికోసం నిక్కి నిక్కి తొంగిజూచే కలువలు, మధువ్రతమునకు మకరందమందిస్తున్న మందారాలు...ఇలా యెన్ని చూపుకొంటూ పోయినా సరిగావుగదా ఏ మహారచయితా ఆ కళ్ళకు సరియైన పోలికలు జూపలేదేమో!

రెప్పల్లో మెత్తదనం, పాపల్లో తియ్యదనం, చూపుల్లో చల్లదనం, అంతేనేమిటి ఈ లోకంలోని సౌందర్యమంత అమృతమై ఆ కన్నుల్లో ప్రవహిస్తోంది.

ఆ మెత్తదనం మెత్తగా నా గుండెల్లో దూసుకపోవాలి. ఆ తియ్యదనం తియ్యగా నా పెదాలపై కురవాలి. ఆ చల్లదనం చల్లగా నా శరీరమంత ప్రాకాలి.

ఆ అదృష్టం నాకుందా?! ఆ అమర సుఖం నాకుందా?!

వుంది! ఆ అదృష్టం, ఆ అమర సుఖం నాకుంది !!

మామిడి కొనకొమ్మల్లో దాక్కొని తియ్యమామిడి రసాస్వాదం చేస్తున్న మేనాదము సంగీతమొలికించింది. మధుర పలుకులు చిలుకరిస్తూ చిలుక దానిమ్మచెట్టు చేరింది. మేఘాలు కన్నమే నాతము మెత్తగా నాట్యము చేయసాగింది.

ఆ సమయంలోనే — హృదయాల్లో ప్రళయము సృజించే ప్రణయోద్యానవనంలో, రతీ మన్మధుల జాజిపూల శోభనపు పందిరిని చాటుచేసి మబ్బుల చాటున శశిలా తొంగి తొంగి జూచింది నా నేత్రసుందరి.

కనిపించీ కనిపించక కనుల మిరుమిట్లుగొలిపే అరుంధతీ నక్షత్రంలా చూపులు ప్రసరిస్తూ, కుసుమముల మాధుర్య మిళితమైన మన్మధ మందిరపు కనకస్థంభములా కనిపించింది సుందరి.

పరుగు పరుగున దరిచేరాను. మేఘాల్లాంటి ఆమె కనుగ్రుడ్లలో మెఱుపులాంటి చూపులలా మెఱసి మాయమయ్యాయి. ఆ చూపుల కాంతులు మేరుపర్వతోన్నతి పొందుతున్న ఆమె వక్షద్వయంమీద ప్రసరించి అలానే నిలచిపోయాయి. కళ్ళు మిఱుమిట్లుగొలిపే కాంతితో వజ్రాల వెలుగునే అపహసించుతూన్న ఆమె బంగారు పర్వతాలపైకి నా చూపు లధిష్ఠించేందుకు పరుగులెత్తాయి. ప్రభాకరుని కామ చూపులకు తాళలేక భూదేవి వారధారంతో తన యెదనున్న మేరుపర్వత శిఖరములను కప్పుకొన్నట్లామె పైటను మెత్తగా సర్దుకొంది

'సుందరీ !'

గోరంక కూజితంలా వెలువడిందా శబ్దం నానుండి. సంధ్యాసమయంలో శశి రాక గమనించి సిగ్గుతో రక్తారుణిమం పొందుతున్న అంబరంలా, గులాబివర్ణ ఛాయలామె బుగ్గలందలుముకొంటున్నాయి. మందమారుతరాపిడికి మెత్తగా కదిలే పత్రంలా పెదాలు వణుకుతున్నాయి. కొంచెం తల పైకెత్తి వాలుగా చూసిందా సుందరి నావైపు.

'సుందరీ! మన వలపులు నిష్ఫలమేనా?'

'స్వామీ!...పూలు పూయని తీగలాంటిదికాదు మన వలపు' మణితంలా వుందామె కంఠం.

'నిజమా సుందరీ...మరీ! మన ప్రణయ లతలు పెనవేసుకొన్నది చూచి ఓర్వలేక ప్రకృతి ప్రళయాన్ని సృజిస్తోంది. దాని దుండగము జూస్తు నేను ఓర్వలేను. నీ వంగీకరించు...ఒక్కసారిగా ఈ ప్రకృతిని ధ్వంసం జేస్తాను''.

'స్వామీ! వుద్రేకపడుతున్నారు. నిదానంగ ఆలోచించండి. ఏ ప్రకృతిని మీరు ధ్వంసంచేయాలనుకొంటున్నారో, ఆ ప్రకృతిలోనే మనం పెరుగుతున్నాం.'

'ఏమో...నిదానమంటూ ఇంతవరకు తెచ్చావు. ఇక నేను సహించలేను సుందరీ...సహించలేను...'

'స్వామీ...' తల పైకెత్తి సూటిగా నా కళ్ళల్లోకి చూచింది సుందరి. ఆ చూపులే...ఆ కళ్ళనుండి ప్రసరించే మెఱుపు కాంతులే ... ఇంతవరకాపుతున్నాయి. లేకపోతే ఈ ప్రకృతి నేమిజేసేవాడినో.

'అలానే చూడు సుందరీ...నీ కళ్ళలో నా రూపు జూచుకొంటాను.'

'స్వామీ...' పవనంలో పతాకంలా ఆమె కను రెప్పలు కదిలాయి. 'స్వామీ...' అటుచూడు భీకర మయిన రొదచేసుకొంటూ మనపై సుడిగాలి దూసుక వస్తూంది. నాకేమో భయమవుతూంది. కళ్ళు మూసు కొంటాను.

'సుందరీ! ఆ గాలి మనలనేం చేస్తుందిలె...భయ మెందుకు...నా ఒడిలో నిన్ను దాచుకొంటానుగా...!'

'మీ ఆనందమె నా ఆనందం. మీ యిష్టప్రకారమె కానిస్తాను. మన ప్రణయశక్తిముందా ప్రకృతి శక్తి విలువెంత.'

'ఆహా సుందరీ! నీ కనుపాపల్లో నా రూపును చూచు కొంటుండ నీ తియ్యని రూపమె చూస్తున్నాను' ఆమె కన్నుల్లోకి తొంగిచూస్తూ అన్నాను.

'స్వామి' అంది బాధగా. 'సుంధరీ' అన్నాను. మమ్మల్ని త్రోసుకొంటూ ముందు కెళ్ళిపోయిందా సుడి గాలి.

'అమ్మ!' కళ్ళుమంట స్వామీ...మంట...'

'సుందరీ'

'తాళలేను బాధగా వుంది స్వామీ' ఎంత ప్రయత్నిం చినా మెత్తగా ఆమె కళ్ళుముకుళించుక పోయాయి.

'సుందరీ చూచావా ఈ ప్రకృతి ప్రళయాంతకబుద్ధి. మన అమర ప్రేమ దానికి గిట్టదు. సుందరీగిట్టదు.' నా కళ్ళనుండి కన్నీరు స్రవించాయి.

'స్వామీ! ఎవరో అల్పులని మనమూ అల్పుల మయ్యేందుకు ప్రయత్నించవచ్చా. అయినా నా కొక్కటే బాధ. నా కళ్ళలో ఆ సుడిగాలి దుమ్ము కొట్టింది. ఇక మీకోరికతీరేదెలా స్వామీ' నాయెదపై తలనిదుకొని వెక్కి వెక్కి యేడ్వసాగింది ... 'స్వామీ - నే నొక్కటి కోరనా - మీరు నన్ను సుందరీ యని పిలువకండి నా పేరు శకుంతల ... 'శకూ! అని ముద్దుగా పిలువలేరా.'

'శకూ! అలానే పిలుస్తాను'

'స్వామీ ఇక నేను మిమ్మల్ని చూడలేనా'.

'శకూ! నీ అందమైన చూపుకోలక ఈ విశాలమైన ప్రకృతి నెదురిస్తున్నాను. అటువంటి నా ప్రాణమైన నీ చూపులు లేకపోతే నేను బ్రతగ్గలనా? లేదు శకూ నీ కోసం నా ప్రాణమైనా అర్పిస్తాను. ఈ రోజునుండే తీవ్రమయిన తపస్సు చేస్తాను. భగవానుడు సహృదయుడు నా మొరవినక మానడు మళ్లీ నీకళ్ళల్లో నా రూపుచూచు కొనే అదృష్టం కలిగించక మానడు. బాధపడకు శకూ, నేనే నీవు-నీవే నేనుగా కలకాలం బ్రతుకుందాం పలుకవేం శకూ!

'స్వామీ!'

'శకూ!'

గట్టిగా కావలించుకొన్నాను: ఆకాశంలో పయని స్తున్న చిలుక, ముక్కున కఱచుకొన్న మామిడిచిగు ర్లను మాపై అక్షతల్లా జల్లి ముందుకెళ్ళి పోయింది.

'స్వామీ కళ్ళు చల్లగవుతున్నాయ్. నాకు మీరు కని పిస్తున్నారు' కనురెప్పలు ఫలఫలలాడిస్తూ అంది శకుంతల.

అంతేచాలు శకూ నీకళ్ళలో నా రూపు చూచుకొనే అదృష్టం దేవుడు మళ్లీ నాక్కలిగించాడు అదృష్టవంతుని శకూ నే నదృష్టవంతుని—

పండిత డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
Diamond Jubilee
1898 1958
ఆయుర్వేదాశ్రమం (ప్రైవేట్) లిమిటెడ్,
మదరాసు-17.